సాక్షి
నిర్మల్
గురువారం । 11 । జనవరి । 2024



దీక్షకు భూమికి కొత్తశోభ 8లో▸
జాతీయ బంజారాల దీక్షభూమి వద్ద ఆధ్యాత్మిక శోభ నెలకొంది. జగదాంబదేవి, రాష్ట్రీయ సంత్ మహాన్ తపస్వీ, ధర్మ గురువు రామారావు మహారాజ్ మందిరాలను ముస్తాబు చేశారు.



'పది'లో శతశాతం లక్ష్యంగా..
ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
31.0 / 19.0

వాతావరణం
ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి కాస్త తగ్గుతుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

మమ అనిపించారు..!

- జెడ్పీ సమావేశానికి ఎమ్మెల్యేల డుమ్మా
- కొద్దిమందే హాజరైన జెడ్పీటీసీ సభ్యులు
- ఆలస్యంగా వచ్చిన ఉన్నతాధికారులు



ఖాళీగా ఎమ్మెల్యేల కుర్చీలు

నిర్మల్‌రూరల్: అసెంబ్లీ ఎన్నికల తర్వాత మొదటిసారి జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన జెడ్పీ సమావేశానికి కొత్త ఎమ్మెల్యేలు వస్తారని అంతా ఆశించారు. కానీ.. ముగ్గురిలో ఒక్కరూ రాలేదు. చాలామంది జెడ్పీటీసీ సభ్యులు గైర్హాజరయ్యారు. జిల్లా అధికారులూ ఆలస్యంగా వచ్చారు. ఎప్పటిలాగే ఏదో నిర్వహించాలి కాబట్టి.. అలా మమ అనిపించేశాం.. అన్నట్లుగానే బుధవారం జిల్లా పరిషత్ సమావేశం సాగింది. హాజరైన అధికారులు నివేదికలు వివరించగా, పలువురు సభ్యులు తమ పరిధిలోని సమస్యలు వారి దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి సీతక్క, ఆరోగ్య శాఖ అధికారి కర్ణన్ జిల్లాకు రావడంతో వారిని కలిసిన కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ గంటన్నర ఆలస్యంగా వచ్చారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ గంట ఆలస్యంగా హాజరయ్యారు. అంతకుముందే ఒక్కొక్కశాఖ తరఫున జిల్లా అధికారులు అధికారి తమ నివేదిక చదివి వినిపించారు. అనంతరం మొదటిసారి జెడ్పీ సమావేశానికి వచ్చిన కలెక్టర్, అదనపు కలెక్టర్‌ను సభ్యులు ఘనంగా సన్మానించారు. సీఈవో సుధీర్‌బాబు, డీసీఎంఎస్ చైర్మన్ లింగయ్య, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ తరలించండి



సీఎంకు విన్నవిస్తున్న దిలావర్‌పూర్ వాసులు

దిలావర్‌పూర్: మండల కేంద్రంతోపాటు గుండంపల్లి గ్రామాల మధ్య నిర్మించే ఇథనాల్ ఫ్యాక్టరీని తమ ప్రాంతం నుంచి వెంటనే తరలించాలంటూ సీఎం రేవంత్‌రెడ్డితోపాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు ప్రజలు విన్నవించారు. మంగళవారం హైదరాబాద్‌లో సీఎంను డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డితో కలిసి దిలావర్‌పూర్ గ్రామ ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ ఏర్పాటుతో వ్యవసాయంతోపాటు సాగు, తాగునీటికి తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయని సీఎంకు విన్నవించారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి తమ ప్రాంతం నుంచి ఫ్యాక్టరీని తరలించేలా చర్యలు తీసుకోవాలని వారు సీఎంను వేడుకున్నారు.

ఉద్యోగాలకు స్పెషల్ డ్రైవ్

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్, తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ కింద రిజిస్టర్డ్ రిక్రూట్మెంట్ ఏజన్సీ ఇజ్రాయేల్‌లో విదేశీ ఉద్యోగ నియామకాలను సులభతరం చేయడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోందని జిల్లా ఉపాధి కల్పనాధికారి జీ రాములు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12వ తేదీన నిర్మల్‌లోని రాజీవ్‌గాంధీ ఐటీఐ కళాశాలలో స్పెషల్ డ్రైవ్ ఉంటుందని పేర్కొన్నారు. ఇజ్రాయేల్‌లో నిర్మాణ కార్మికులు షట్టరింగ్ కార్పెంటర్లు, సిరామిక్ టైలింగ్, ప్లాస్టరింగ్, ఐరన్ బెండింగ్ వర్కర్లకు డిమాండ్ ఉందని తెలిపారు. నెలకు రూ.1.20లక్షల నుంచి రూ.1.38లక్షల ప్యాకేజీ ఉంటుందని పేర్కొన్నారు. ఎస్సెస్సీ ఉత్తీర్ణత, కనీసం మూడేళ్ల అనుభవం కలిగి 21–45 వయస్సున్న వారు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు www.tomcom.telangana.gov.inలో లేదా 8247838789, 98496 39539, 78935 66493 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులకు సన్మానం



గిన్నిస్ రికార్డు సాధించిన విద్యార్థులతో ఎమ్మెల్యే

లక్ష్మణచాంద: గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించిన విద్యార్థులను నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అభినందించారు. గత నెల 24న గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ కోసం భారత్ ఆర్ట్స్ అకాడమీ ఏబీసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియం వేదికగా 7వేల మందికి పైగా నృత్య కళాకారులతో నాట్య ప్రదర్శన నిర్వహించారు. మండలంలోని చామన్‌పెల్లి గ్రామానికి చెందిన నృత్య టీచర్ ఏలేటి అంజలీరెడ్డి నిర్వహిస్తున్న నృత్యమాల నాట్య అకాడమీకి చెందిన పలువురు విద్యార్థులు ఇందులో పాల్గొని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించారు. దీంతో బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నృత్యం టీచర్ అంజలీరెడ్డి, విద్యార్థులను అభినందించి మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

క్యాంప్ ఫెయిల్!

- అవిశ్వాసం' ఉన్నట్లా.. లేనట్లా..!
- పార్టీలకతీతంగా వెళ్లిన కౌన్సిలర్లు
- చైర్మన్ కోసం బీజేపీ నేత యత్నం
- మద్దతు తెలుపని మాజీ మంత్రి
- ఇంకా ఆశల్లో పలువురు కౌన్సిలర్లు
- తెరపైకి మళ్లీ అపర్ణప్రదీప్ పేరు



నిర్మల్ మున్సిపాలిటీ కార్యాలయం

నిర్మల్: నిర్మల్ మున్సిపల్‌లో కౌన్సిలర్ల క్యాంప్ కథ ఫ్లాప్ అయ్యింది. అవిశ్వాస పర్వం రెండురోజుల్లోనే ముగిసింది. సొంతపార్టీ చైర్మన్‌పై బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్లతో కలిసి పెట్టాలనుకున్న అవిశ్వాసం ప్రస్తుతానికి బ్రేక్ పడింది. బీజేపీలో చేరిన కౌన్సిలర్ అయ్యన్నగారి రాజేందర్‌ను చైర్మన్ చేయాలనుకోవడం.. ఇందుకు మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మద్దతు తెలుపకపోవడంతో క్యాంప్ కథ ముగిసింది. ప్రస్తుతానికి చేసేదిలేక క్యాంప్‌లో ఉన్న కౌన్సిలర్లు పట్నం నుంచి నిర్మల్ వెనుదిరిగారు. అయినా.. చివరివరకు ప్రయత్నం చేస్తామని, ప్రస్తుతం చైర్మన్ ఈశ్వర్‌ను దింపేస్తామని పలువురు కౌన్సిలర్లు విశ్వాసం వ్యక్తంచేస్తున్నారు. బీజేపీకి చెందిన అయ్యన్నగారి రాజేందర్ కాని పక్షంలో బీఆర్‌ఎస్‌కు చెందిన అపర్ణప్రదీప్‌ను చేయవచ్చన్న చర్చ కొనసాగుతోంది.

హైదరాబాద్ క్యాంప్‌లో..
ప్రస్తుత మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్‌ను ఎలాగైనా దింపేయాలన్న లక్ష్యంతో మెజార్టీ కౌన్సిలర్లు ఈనెల 8వ తేదీన హైదరాబాద్‌కు వెళ్లారు. అక్కడి హోటల్‌లో క్యాంప్ పెట్టారు. నిర్మల్ బల్దియాలోని మొత్తం 42మంది కౌన్సిలర్లలో దాదాపు 30మంది తమవైపు ఉన్నట్లు వారు ప్రకటించారు. ఇందులో అధికార బీఆర్‌ఎస్‌తో పాటు ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్లూ ఉన్నారు. చాలామంది సొంతపార్టీ చైర్మన్‌పై వ్యతిరేకతతోనే ఈ జట్టులో చేరారు. మెజార్టీ కౌన్సిలర్లంతా ఒకేవైపు రావడంతో ఇక అవిశ్వాసం ఖాయమన్న సంకేతాలు ఇచ్చారు. కొత్త చైర్మన్‌గా బీజేపీలో చేరిన కౌన్సిలర్ అయ్యన్నగారి రాజేందర్ పేరు ఖరారు చేశారు.

చైర్మన్ పేరు చెప్పడంతో..
అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరిన అయ్యన్నగారి రాజేందర్ చైర్మన్ ఖాయమన్న విషయం తెలియడంతో నిర్మల్‌లో తెరవెనుక రాజకీయం మొదలైంది. బీఆర్‌ఎస్ నుంచి వెళ్లిపోయిన కౌన్సిలర్‌ను చైర్మన్‌గా ఎలా చేస్తారంటూ పలువురు సీనియర్ నేతలు మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కలిసినట్లు తెలిసింది. సదరు నేతలతో మంతనాల అనంతరం ఐకేరెడ్డి అయ్యన్నగారి రాజేందర్‌ను చైర్మన్‌గా ఒప్పుకొనేది లేదని పార్టీ కౌన్సిలర్లు, నాయకులకు చెప్పినట్లు సమాచారం. దీంతో క్యాంప్‌లో ఉన్న కౌన్సిలర్లు డైలామాలో పడ్డారు. మరోవైపు రెండురోజుల కిందట అవిశ్వాసానికి వస్తామని ఒప్పుకొన్న ఇద్దరు కౌన్సిలర్లూ రాకపోవడంతో క్యాంప్‌లో కలవరం మొదలైంది. చివరకు చేసేది లేక హైదరాబాద్‌కు వెళ్లిన కౌన్సిలర్లంతా బుధవారం రాత్రి నిర్మల్‌కు చేరుకున్నారు.

తెరపైకి అపర్ణప్రదీప్..
చైర్మన్ పదవి కోసం రాజేందర్ విశ్వప్రయత్నాలు చేసినా ప్రయోజనం లేకపోవడంతో ఆయన వెనుకంజ వేసినట్లు కౌన్సిలర్లు పేర్కొన్నారు. ఎలాగైనా ప్రస్తుత చైర్మన్‌ను దింపేయాలన్న ఉద్దేశంలో ఉన్న కౌన్సిలర్లు రాజేందర్ స్థానంలో బీఆర్‌ఎస్‌కే చెందిన మేడారం అపర్ణప్రదీప్‌ను చైర్‌పర్సన్ చేసే ప్రయత్నాలూ చేస్తున్నారు. గత కొంతకాలంగా బీసీ నేతగా ఉన్న మేడారం ప్రదీప్ కూడా ఈ పదవి కోసం తనవంతు ప్రయత్నం చేస్తూ వస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో తన భార్య అపర్ణను చైర్‌పర్సన్ చేయాలని ఆయన తెరపైకి వచ్చారు.

'కుల'రాజకీయం..!
నిర్మల్ మున్సిపాలిటీలో ఎప్పటి నుంచో కులరాజకీయం కొనసాగుతూ వస్తోంది. ఇక్కడ ఎమ్మెల్యే రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేత ఉంటే.. మున్సిపల్ చైర్మన్ మున్నూరుకాపులకు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుత చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ కూడా మున్నూరుకాపు సామాజిక వర్గానికి చెందినవారే. కానీ.. పార్టీకి చెందిన కౌన్సిలర్లే ఆయనను వ్యతిరేకిస్తుండటం, మాజీ మంత్రి కూడా కొంత విముఖతతో ఉండటంతో ఆయనపై కొన్నివారాలుగా అవిశ్వాస ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఒకవేళ ఈశ్వర్‌పై అవిశ్వాసం పెడితే చైర్మన్‌గా మళ్లీ మున్నూరుకాపులే ఉండాలని బీఆర్‌ఎస్‌లోని ఆ సామాజికవర్గ నేతలు మాజీ మంత్రిపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం చైర్మన్ కోసం గట్టిగా ప్రయత్నం చేస్తున్న అయ్యన్నగారి రాజేందర్ కూడా అదే సామాజిక వర్గానికి చెందినప్పటికీ బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరడంతో అల్లోల, ఇతర నేతలు విముఖత చూపుతున్నట్లు చెబుతున్నారు. ఇక ప్రత్యామ్నాయంగా తెరపైకి వచ్చిన మేడారం అపర్ణప్రదీప్ సీనియర్ అయినప్పటికీ మున్నూరుకాపు సామాజికవర్గం కాకపోవడంతో పూర్తిస్థాయిలో మద్దతు లభించడం లేదన్న వాదన వినిపిస్తోంది. బీసీ నేతగా ఉన్న ప్రదీప్ మాత్రం ఈ స్వల్ప పదవీకాలాన్ని తమకు ఇవ్వాలని కోరుతున్నారు. మొత్తం మీద క్యాంప్ కథ ముగిసినా.. మెజార్టీ కౌన్సిలర్లలో మాత్రం అవిశ్వాసంపై ఇంకా ఆశలున్నాయి. క్యాంప్ నుంచి వచ్చిన కౌన్సిలర్లంతా గురువారం నిర్మల్‌లోనే మళ్లీ సమావేశం కానున్నట్లు తెలిసింది.

ఏసీబీకి చిక్కిన కడెం తహసీల్దార్

- రైతు నుంచి రూ.9వేలు లంచం తీసుకుంటూ డీటీతో సహ పట్టుబడిన అధికారి



పట్టుబడిన తహసీల్దార్, డీటీతో ఏసీబీ అధికారులు

కడెం: కడెం తహసీల్దార్ ఎం.రాజేశ్వరి, డీటీ చిన్నయ్య ఏసీబీకి చిక్కారు. మండలంలోని కొత్తమద్దిపడగ గ్రామానికి చెందిన రైతు లసెట్టి రాజన్న మూడు పట్టాల కోసం గత నెల 28న స్లాట్ బుక్ చేశాడు. పట్టా విషయమై పలుసార్లు తహసీల్దార్‌ను కలిశాడు. రూ.15వేలు ఇస్తేనే పట్టా చేస్తానని తహసీల్దార్ రాజేశ్వరి డిమాండ్ చేశారు. ఈ క్రమంలో బాధితుడు తాను అన్ని డబ్బులు ఇవ్వనని రూ.9 వేలు ఇస్తానని నమ్మించాడు. ఈనెల 9వ తేదీన ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బుధవారం డాక్యుమెంట్లు తహసీల్దార్ రాజేశ్వరికి అందజేశాడు. తహసీల్దార్ చెప్పినట్లుగా డీటీ చిన్నయ్యకు రూ.9వేలు ఇచ్చాడు. అక్కడే వేచి ఉన్న ఏసీబీ అధికారులు డీటీ చిన్నయ్య నుంచి రూ.9 వేలు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, సీఐలు జాన్‌రెడ్డి, రవీందర్, సిబ్బంది ఉన్నారు.

డబ్బులు డిమాండ్ చేయడంతోనే..



మా పెదనాన్న భూమ రాజం పేరిట 5 గుంటలు, మరో 5 గుంటలు, తమ్ముడు సురేశ్ పేరిట ఉన్న 24 గుంటలను నా పేరిట గిఫ్ట్ డీడ్‌గా మూడు పట్టాల కోసం స్లాట్ బుక్ చేశాను. మూడు పట్టాలకు ఎంతిస్తావ్.. అని మేడం అడిగింది. రూ.15వేలు ఇస్తేనే పట్టాలవుతాయని డిమాండ్ చేసింది. పలుసార్లు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగి చివరకు ఏసీబీని ఆశ్రయించా.
– లసెట్టి రాజన్న, బాధితుడు

మినీ అంగన్‌వాడీలకు మహర్దశ



- సెంటర్లను అప్‌గ్రేడ్ చేస్తూ నిర్ణయం
- జనాభాను అనుసరించి మార్పులు
- జిల్లాలో 110 కేంద్రాలకు అవకాశం
- ఇక చిన్నారులకు విస్తృత సేవలు

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్రం ఐసీడీఎస్ ద్వారా జనాభా ప్రాతిపదికన అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తోంది. మాతా శిశు సమగ్ర అభివృద్ధికి రూపొందించిన ఈ కేంద్రాల ప్రక్షాళనకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అంగన్‌వాడీలను అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని 110 మినీ సెంటర్లకు మహర్దశ పట్టనుంది. చిన్నారులకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. పోషకాహారం, ఆరోగ్యకర వాతావరణం అందనుంది. కేంద్రాల్లోని పోస్టుల సంఖ్య పెరగనుంది. పాలనాపరమైన విధివిధానాలు మరింత పటిష్టం కానున్నాయి. సిబ్బందికి పనిభారం తగ్గి ప్రయోజనాలు కలుగనున్నాయి.

జనాభా ఆధారంగానే..
ప్రస్తుతం గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో 500 నుంచి 1,500 వరకు జనాభా ఉంటే ప్రధాన అంగన్‌వాడీ సెంటర్, 150 నుంచి 500 వరకు ఉంటే మినీ అంగన్‌వాడీ సెంటర్లుగా నిర్వహిస్తున్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోనైతే 300 నుంచి 1,500 వరకు ప్రధాన, 150 నుంచి 300 వరకు ఉంటే మినీ కేంద్రాలుగా కొనసాగుతున్నాయి. తాజా మార్పులతో రూరల్, అర్బన్ ప్రాంతాల్లో 400 నుంచి 800 జనాభా ఉంటే ప్రధాన కేంద్రాలుగా, 150 నుంచి 400 వరకు ఉంటే మినీ సెంటర్లుగా ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. గిరిజన ప్రాంతాల్లో 300 నుంచి 800 వరకు ప్రధాన, 150 నుంచి 300 వరకు ఉంటే మినీ కేంద్రాలుగా మారనున్నాయి. దీంతో జిల్లాలో పలుచోట్ల కొత్తగా మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు కానుండగా.. ఇప్పటికే ఉన్న మినీ సెంటర్లు అప్‌గ్రేడ్ అయ్యాయి.

పెరగనున్న హెల్పర్ పోస్టులు
మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్ ఒక్కరే ఉంటారు. అన్ని పనులూ టీచరే చేయాల్సి ఉంటుంది. ఇవి మెయిన్ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ అయితే హెల్పర్ పోస్టులు మంజూరు కానున్నాయి. దీంతో మరికొంతమందికి ఉపాధి దొరకనుంది. ప్రధాన కేంద్రాల్లో పనిచేసే టీచర్‌కు నెలకు రూ.13,650 వేతనం ఉండగా, మినీ కేంద్రంలోని టీచర్‌కు రూ.7,800 మాత్రమే. అప్‌గ్రేడ్‌తో మినీ కేంద్రాల టీచర్ల వేతనం కూడా పెరిగి వారికి ప్రయోజనం కలుగుతుంది. ప్రధాన కేంద్రాలుగా మారనున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇంటర్ విద్యార్హత ఉన్న వారు టీచర్లుగా కొనసాగుతారు. ఇంటర్ అర్హత లేని వారు హెల్పర్లుగా కొనసాగుతారు. పదేండ్ల క్రితం అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో తక్కువ జనాభా ఉండడం, రెవెన్యూ గ్రామాలకు ఆవాసాలు దూరంగా ఉండడంతో నాటి ప్రభుత్వం ఆయా ప్రాంతాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేసింది. వాటిని మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చాలని వచ్చిన విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించింది.

జిల్లాలోని అంగన్‌వాడీల వివరాలు

ఐసీడీఎస్ ప్రాజెక్టులు	4
సెక్టార్లు	37
మెయిన్ అంగన్‌వాడీలు	816
మినీ అంగన్‌వాడీలు	110

ప్రాజెక్టుల వారీగా సిబ్బంది

ప్రాజెక్టు	మెయిన్..	మినీ..	హెల్పర్
భైంసా	175	18	157
ఖానాపూర్	194	37	183
ముధోల్	154	18	125
నిర్మల్	252	26	205

లబ్ధిదారుల వివరాలు

గర్భిణులు	6,014
బాలింతలు	5,155
ఆరేళ్లలోపు చిన్నారులు	59,129

చిన్నారుల ఎదుగుదలకు..
చిన్నారుల ఎదుగుదల అంగన్‌వాడీ కేంద్రాల్లోనే మొదలవుతోంది. పరిసరాలు, పరిశుభ్రత, పౌష్టికాహారం, ఇతర సౌకర్యాలు కల్పించి పిల్లల మానసిక ఎదుగుదలకు ఈ కేంద్రాలు దోహదపడుతున్నాయి. చిన్నారులకు పోషకాహారం అందించడంతో పాటు ఆటపాటలతో విద్యనందిస్తూ వారు పాఠశాలలకు ఆకర్షితులయ్యేలా చేస్తున్నాయి. కేంద్రాల్లోని టీచర్లు గర్భిణులు, బాలింతలకు అవసరమైన పౌష్టికాహారం అందిస్తూ ఆరోగ్య సలహాలు, సూచనలు ఇస్తున్నారు. జనాభా ప్రాతిపదికన ఒక్కో గ్రామంలో ఒకటి నుంచి నాలుగు వరకు ప్రధాన, మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటి ద్వారా గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. చిన్నారులకు ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్య బోధిస్తున్నారు.

సేవలు మరింత విస్తృతం
శిశు సంక్షేమశాఖ ఆదేశాల మేరకు జిల్లాలో అర్హత కలిగిన మినీ అంగన్‌వాడీ కేంద్రాల జాబితా రూపొందించాం. నాలుగు క్లస్టర్లలో 110 కేంద్రాలున్నాయి. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయడం మంచి పరిణామం. చిన్నారులపై మరింత శ్రద్ధ పెట్టే అవకాశం ఉంటుంది. పనిభారం తగ్గి విస్తృత సేవలు అందుబాటులోకి వస్తాయి.
– రమేశ్, జిల్లా సంక్షేమాధికారి

నెలలో ఆరురోజులు ఉమ్మడి జిల్లాలోనే..



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

నిర్మల్‌చైన్‌గేట్: నెలలో ఆర్రోజులు ఉమ్మడి జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంటానని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, పంచాయతీరాజ్, గిరిజనశాఖ మంత్రి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి దనసరి సీతక్క పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని రాజరాజేశ్వర గార్డెన్స్‌లో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ఆధ్వర్యంలో పార్టీ జిల్లా సమన్వయకర్తల సమావేశం నిర్వహించగా మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా అక్షర క్రమంలో ముందుండి అభివృద్ధిలో వెనుకబడిందని తెలిపారు. రెండు పర్యాయాలు సీఎంగా ఉన్న కేసీఆర్ ఒక్కసారి కూడా బాసర సరస్వతీ అమ్మవారిని దర్శించుకోలేదని విమర్శించారు. ఓడిన కాంగ్రెస్ అభ్యర్థులు కూడా ప్రజల్లోనే ఉండి వారి సమస్యలు తీర్చేందుకు ముందుండాలని సూచించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కష్టపడి కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నేతత్వంలో ఈ నెల 14న ఇంఫాల్ నుంచి ప్రారంభం కానున్న భారత్ జోడో న్యాయ్ యాత్ర మార్చి 20న ముంబైలో ముగుస్తుందని తెలిపారు. ఈ యాత్ర 15 రాష్ట్రాలు, 110 జిల్లాలు, 110 లోక్‌సభ స్థానాల గుండా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విద్య, వైద్యం అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. 317 జీవో రద్దు కోసం ప్రభుత్వానికి విన్నవిస్తానని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించి సోనియాగాంధీ రుణం తీర్చుకుంటానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్కకు వినతులు వెల్లువలా వచ్చాయి. సమావేశంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

'కడెం'ను ఆధునికీకరిస్తాం
కడెం: కడెం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో ఆధునికీకరిస్తామని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఆనాడు ప్రధాని నెహ్రూ శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్టులు కట్టించారని, అవి నేటికీ చెక్కు చెదరలేదని తెలిపారు. తాత్కాలిక మరమ్మతు కోసం రూ.ఐదు కోట్లు మంజూరయ్యేలా ప్రాజెక్ట్ సమస్యలు సీఎం రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. కడెం ఆయకట్టు రైతాంగానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మాజీ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్, ఎంపీపీ అలెగ్జాండర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పీ సతీశ్‌రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ గుర్రం మోహన్‌రెడ్డి, వాజిద్ ఖాన్, సత్యంచారి, నీటి పారుదలశాఖ అధికారులు, సిబ్బంది తదితరులున్నారు.

మెరుగైన సేవలందించాలి



పేషెంట్లతో మాట్లాడుతున్న ఆర్వీ కర్ణన్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా ఆస్పత్రుల్లో మెరుగైన సేవలందించాలని ప్రజారోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్, తెలంగాణ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇన్‌చార్జి మేనేజింగ్ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రసూతి ఆస్పత్రిని బుధవారం సందర్శించారు. ఆపరేషన్ థియేటర్, అన్ని విభాగాలు పరిశీలించారు. అమ్మ ఒడి వాహనాలను తనిఖీ చేశారు. ఆవరణలోని అపరిశుభ్రతపై అసహనం వ్యక్తం చేశారు. వెంటనే 10 టాయిలెట్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా జనరల్ ఆస్పత్రిని సందర్శించి రెండో అంతస్తులో నిర్మించిన 150 పడకలను ఈ నెల 26వరకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అనంతరం మెడికల్ కళాశాల భవనాన్ని పరిశీలించారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ జేవీడీఎస్ ప్రసాద్, జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీల్, డాక్టర్ ధనరాజ్, జిల్లా ఆస్పత్రుల పర్యవేక్షకుడు దేవేందర్‌రెడ్డి తదితరులున్నారు.

ఆలయాభివృద్ధికి కృషి



విజేతకు బహుమతి ఇస్తున్న ఎంపీ బాపూరావు

ఖానాపూర్: పట్టణంలోని అయ్యప్ప ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ సోయం బాపూరావు తెలిపారు. బుధవారం పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యుల విన్నపం మేరకు ఆలయానికి రూ.20లక్షల మంజూరుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. లక్కీ డ్రాలో గెలుపొందిన 60మంది భక్తులకు అయ్యప్ప వెండి నాణేలతోపాటు 540 మందికి అయ్యప్పస్వామి చిత్రపటాలు అందజేశారు. ఆలయకమిటీ అధ్యక్షుడు రాజన్న, నాయకులు శంకర్, రాజశేఖర్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ తీరు సరికాదు
అయ్యప్ప ఆలయంలో జరిగిన కార్యక్రమాలకు హాజరైన ఎంపీ బాపూరావు స్థానిక నాయకులకు సమాచారం ఇవ్వకపోవడం సరికాదని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్, పట్టణాధ్యక్షుడు నాయిని సంతోష్ పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎంపీపై త్వరలోనే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. నాయకులు రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, ఉపేందర్, శ్రీనివాస్, బుచ్చన్న, మల్లయ్య, అనిల్‌రావు, భూమన్న, సత్యవతి, రవి, భీమేశ్, పరమేశ్వర్, సుధాకర్, లింబాద్రి, రాజేశ్వర్, రంజిత్, వెంకటేశ్ తదితరులున్నారు.

నిలిచిన అద్దెబస్సులు

- ఇబ్బందుల్లో ప్రయాణికులు

భైంసాటౌన్: కేంద్రప్రభుత్వం తెచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ భైంసాలో ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు బుధవారం మెరుపు ఆందోళన చేపట్టారు. ఉదయం నుంచే బస్సులను నిలిపేసి డిపో వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రం తెచ్చిన కొత్త చట్టంతో డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, భైంసా ఆర్టీసీ డిపో పరిధిలో అద్దె బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అత్యవసర ప్రయాణాలు పెట్టుకున్నవారు, ఉద్యోగులతోపాటు ప్రస్తుతం డిగ్రీ పరీక్షలు కొనసాగుతుండడంతో విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు వెళ్లలేకపోయారు. సంస్థ బస్సులు పరిమిత సంఖ్యలో నడిచినా.. తగినన్ని సర్వీసులు లేక ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు.

క్లుప్తంగా

లక్ష్మణచాంద తొలి మహిళ మాజీ సర్పంచ్ మృతి


సాయవ్వ (ఫైల్)

లక్ష్మణచాంద: లక్ష్మణచాంద తొలి మహిళ మాజీ సర్పంచ్ శెవ్వ సాయవ్వ(68) అనారోగ్యంతో మృతి చెందింది. మూడు సంవత్సరాల నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది. బుధవారం ఉదయం పరిస్థితి విషమించి మృతి చెందారు. దీంతో ఆమె మృతి చెందిన విషయం తెలుసుకున్న గ్రామస్తులు తరలివచ్చి నివాళులర్పించారు. సర్పంచ్‌గా గ్రామానికి చేసిన సేవలు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

జిన్నింగ్ మిల్లులకు భారీగా పత్తి


రోడ్డుపై క్యూలైన్‌లో పత్తి వాహనాలు

బోథ్: బోథ్ మార్కెట్ పరిధిలోని పలు జిన్నింగ్ మిల్లులకు బుధవారం రైతులు పత్తిని భారీగా తీసుకువచ్చారు. గత మూడు రోజులు సెలవులు ఉండడంతో బుధవారం జిన్నింగ్ మిల్లులకు రైతులు పెద్ద ఎత్తున పత్తిని తీసుకొచ్చారు. దీంతో బోథ్ ప్రధాన రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. సొనాల, నేరడిగొండ మండలాల్లో పత్తి నిల్వలు ఎక్కువగా ఉండటంతో సీసీఐ కొనుగోళ్లను రెండు రోజుల పాటు నిలిపివేసింది. ఈ మేరకు ఆయా మండలాల్లోని రైతులు పత్తిని బోథ్‌కు తీసుకువచ్చారు.

గుడుంబా స్థావరాలపై దాడులు


దాడులు నిర్వహిస్తున్న అధికారులు

కడెం: మండలంలోని పెద్దూర్‌తండా, నర్సాపూర్, పాండ్వపూర్, అంబారిపేట్ గ్రామాల్లో బుధవారం ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్, నిఘా విభాగం అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పది లీటర్ల గుడుంబా, 1500 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ సంపత్‌కృష్ణ తెలిపారు. ఇందులో ట్రాస్క్‌ఫోర్స్ సీఐ రంగస్వామి, గంగారెడ్డి, ఎక్సైజ్ ఎస్సై జె.రమేశ్ ఉన్నారు.

పింఛన్ కష్టాలు..


క్యూలైన్‌లో మహిళలు, వృద్ధులు

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని స్థానిక పోస్టాఫీస్ వద్ద ప్రతినెలా పింఛన్ల కోసం లబ్ధిదారులు పడే కష్టాలు వర్ణనాతీతం. పెన్షన్ వచ్చిందంటే చాలు అక్కడకు వచ్చే వృద్ధులు, మహిళలు నానా ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం ఉదయం స్థానిక పోస్టాఫీసు వద్ద జనం గుమ్మిగూడడంతో వారందరినీ క్యూలైన్‌లలో రావాలని చెప్పారు. సరైన సిబ్బంది లేకపోవడంతో పెన్షన్ దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇకనైనా సిబ్బందిని పెంచి సకాలంలో పింఛన్లు ఇబ్బందులు లేకుండా అందించాలని వేడుకుంటున్నారు.

దీక్ష భూమికి.. కొత్తశోభ


శ్రీసంత్ రామారావు మహరాజ్ విగ్రహం


దీక్ష భూమి వద్ద ముస్తాబైన జగదాంబదేవి ఆలయం

- నేడు గురు కృప దినోత్సవం...
- బోగ్‌బండారో, మహాపూజకు ఏర్పాట్లు పూర్తి
- నిర్వహించనున్న శ్రీసంత్ సద్గురు ప్రేంసింగ్ మహరాజ్
- ముస్తాబైన జాతీయ బంజారా దీక్ష భూమి

నార్నూర్: మండలంలోని కొత్తపల్లి–హెచ్ గ్రామంలోని జాతీయ బంజారాల దీక్ష భూమి వద్ద ఆధ్యాత్మిక శోభ నెలకొంది. దీక్ష భూమి వద్ద కొలువుదీరిన జగదాంబదేవి, రాష్ట్రీయ సంత్ మహాన్ తపస్వీ, ధర్మగురువు రామారావ్ మహారాజ్ మందిరాలను ముస్తాబు చేశారు. దీక్ష గురువు శ్రీసంత్ ప్రేంసింగ్ మహరాజ్ అధ్యక్షతన ప్రతి యేటా జనవరి 11న నిర్వహించే గురుకృప దినోత్సవం (దీక్ష దివస్) కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తిచేశారు. జాతీయ బంజారాల దీక్ష భూమి వద్ద గురువారం ఉదయం లంబాడీల కులదైవమైన జగదాంబదేవి, రాష్ట్రీయ సంత్ మహాన్ తపస్వీ, ధర్మ గురువు శ్రీరామారావ్ మహరాజ్‌లు సోమవారం ఉదయం 11గంటలకు ప్రత్యేక పూజ, బోగ్ బండారో నిర్వహిస్తారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు.

సామాజిక అంశాలపై అవగాహన..

కుమురంభీం జిల్లా కెరమెరి మండలంలోని శంకర్‌లొద్ది వద్ద 1979 దీక్ష గురువు శ్రీసద్గురు ప్రేంసింగ్ మహరాజ్ తపస్సు చేశారు. జనవరి 11, 1979లో మహారాష్ట్రలోని పొరదేవి నుంచి ధర్మ గురువు రాష్ట్రీయ సంత్ మహాన్ తపస్వీ రామారావ్ మహరాజ్ శంకర్‌లొద్ది చేరుకుని దీక్ష చేస్తున్న ప్రేంసింగ్ మహరాజ్‌ను ఎందుకు దీక్ష చేస్తున్నావని అడిగి శిష్యుడిగా స్వీకరించాడు. 1988లో శంకర్‌లొద్ది గ్రామంలో శివయజ్ఞం, 1992లో కొత్తపల్లి–హెచ్ దీక్ష భూమి వద్ద లక్ష్య చండీయజ్ఞాన్ని నిర్వహించారు. అప్పటి నుంచి ప్రతీ ఏడాది కొత్తపల్లి–హెచ్‌లోని జాతీయ బంజారాల దీక్ష భూమి వద్ద గురుకృప దినోత్సవం (దీక్ష దివస్) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు.


ఏర్పాట్లు పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ జనార్దన్

ఆధ్యాత్మికతతోనే మేలు..



ప్రతీ ఏడాది జనవరిలో గురుశిష్యుల మిలన్ కార్యక్రమం నిర్వహిస్తాం. ఆధ్యాత్మికతతోనే సమాజం జాగృతం అవుతుంది. యువతకు సంస్కృతి, సంప్రదాయాలను వివరిస్తున్నాం. శాంతి, అహింసతో ఏదైన సాధ్యమే. వేల సంఖ్యలో వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– శ్రీ సంత్ సద్గురు ప్రేంసింగ్ మహరాజ్, దీక్ష గురువు

సంప్రదాయాలకు అనుగుణంగా



జాతీయ బంజారా దీక్ష భూమి వద్ద నిర్వహించే గురుకృప దినోత్సవం లంబాడా గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఉండాలి. ప్రతీ తండా నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలిరావాలి. అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగింది. భావితరాలకు ఆదర్శంగా ఉండేలా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం.

– రాథోడ్ జనార్దన్, జెడ్పీ చైర్మన్ ఆదిలాబాద్

పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం.



గురుకృప దినోత్సవం నిర్వహణకు దీక్ష భూమి వద్ద అన్ని రకాల ఏర్పాట్లు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తాం. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నాం. ఉదయం 11గంటలకు బోగ్ బండారో, మహాపూజ అనంతరం దర్బార్ ఉంటుంది. భక్తులు విజయవంతం చేయాలి.

– జాదవ్ రెడ్డినాయక్, కమిటీ అధ్యక్షుడు

చిరుతపులి కలకలం..!

- భయాందోళనలో రైతులు


పాదముద్రలు సేకరిస్తున్న ఎఫ్‌బీవో హరిలత

కుంటాల: నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామ శివారులో బుధవారం చిరుత పులి సంచారం కలకలం రేపింది. రైతు పుండ్రు గంగారెడ్డి, పాలేరు సందీప్, తోటి పాలేరు విజయ్‌లతో కలిసి వ్యవసాయ పనులకు వెళ్లారు. వారు పనిలో నిమగ్నమై ఉండగా చిరుతపులి కనిపించడంతో పరుగులు పెట్టారు. రైతు నారాయణరెడ్డి పొలం వైపు వెళ్తుండగా గమనించిన వారు విషయాన్ని గ్రామస్తులకు చెప్పారు. గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎఫ్‌బీవో హరిలత నమూనాలు సేకరించి చిరుత పులి పాదముద్రలుగా నిర్ధారించారు. ఆమె వెంట సిబ్బంది అలాంఖాన్ ఉన్నారు. దీంతో రైతులు పంట చేనులకు వెళ్లేందుకు జంకుతున్నారు. అలాగే ఎఫ్‌ఆర్వో రాథోడ్ రమేష్, ఎఫ్‌ఎస్‌వో శ్రీనివాస్, ఎఫ్‌బీవో స్రవంతి సైతం ఘటనా స్థలాన్ని పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వివరించారు.

- కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి...
- మిగిలిన పోడు భూములన్నింటికీ పట్టాలు అందించాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్ వెస్లీ

ఎదులాపురం: ప్రజా సమస్యల పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్ వెస్లీ అన్నారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో బుధవారం నిర్వహించిన పార్టీ జిల్లా ప్లీనరి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలైన ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దోపిడీ విధానాలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్మికులు, కర్షకుల హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. దళితులపై దాడులు జరుగుతున్నాయని, ఏడాదికి వెయ్యి మంది హత్యకు గురవుతున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం 13 లక్షల ఎకరాల పోడు భూములకు గాను కేవలం 3 లక్షల ఎకరాలకు పట్టాలు పంపిణీ చేసిందని గుర్తుచేశారు. మిగిలిన వాటికి పట్టాలు అందించాలని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. అనంతరం జిల్లా అభివృద్ధి, సమస్యల పరిష్కారం దిశగా పలు తీర్మానాలు చేశారు. సీసీఐ పరిశ్రమను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జి బండారు రవికుమార్, జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, పార్టీ కార్యదర్శివర్గ సభ్యుడు లంకా రాఘవులు, సీనియర్ నాయకుడు బండి దత్తాత్రి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, మంజుల, సురేందర్ ఉన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం


జెండా ఎగురవేస్తున్న సీపీఎం నాయకులు


మాట్లాడుతున్న కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

- తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేశ్


నినాదాలు చేస్తున్న ఆదివాసీలు

ఆదిలాబాద్‌రూరల్: లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేష్ అన్నారు. బుధవారం మావల మండలంలోని బట్టిసావర్‌గాం శివారు ప్రాంతంలోని కుమురంభీం గూడలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆదిలాబాద్‌అర్బన్, మావల మండల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టబద్ధత లేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 342కు విరుద్ధంగా చట్ట సభలో ఆమోదం లేని లంబాడాలతో తెలంగాణ రాష్ట్ర రిజర్వేషన్‌లో ఆదివాసీలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము చేస్తున్న పోరాటంలో ప్రజా, రాజకీయ, న్యాయపోరాటంలో అందరిని కలుపుకుని శాస్త్రీయ పద్ధతిలో ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. ఆదివాసీ గూడాలలో కనీస మౌలిక వసతులైన తాగునీరు, రోడ్డు, వైద్యం వంటి సౌకర్యాలు కల్పించేందుకు జిల్లా ఉన్నత అధికారులు, స్థానిక ఎమ్మెల్యేలు చొరవ తీసుకోవాలన్నారు. అనంతరం తుడుం దెబ్బ ఆదిలాబాద్ పట్టణ, మావల మండల కమిటీలకు ఎన్నికలు నిర్వహించి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా మడావి దిగంబర్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా అనక గంగారాం, మావల మండల అధ్యక్షుడిగా వెడ్మ ముకుంద్, ప్రధాన కార్యదర్శిగా పంద్రం గంభీర్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కొడప నగేష్, రాష్ట్ర సహాయ కార్యదర్శి కుమ్రశ్యామ్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, నాయకులు సలాం వరుణ్, సోయం లలిత, మర్సుకోల భరత్, ఆత్రం గణపతి పాల్గొన్నారు.

శనగపంటను ఆశిస్తున్న పచ్చ, లద్దె పురుగు


పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

నేరడిగొండ: యాసంగిలో సాగవుతున్న శనగ పంటను పచ్చ, లద్దె పురుగులు ఆశిస్తున్నాయని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య అన్నారు. బుధవారం మండలంలోని సావర్గం గ్రామంలోని శనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో రైతులు శనగ పంటను అత్యధికంగా పండిస్తున్నారని తెలిపారు. శనగలో కొన్నిచోట్ల శనగ పచ్చ పురుగుతో పాటు లద్దె పురుగు సోకిందని తెలిపారు. వీటి నివారణకు నోవల్యురాన్ లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ మందులను పిచికారీ చేయాలని సూచించారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని పేర్కొన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి బిర్రు భాస్కర్, ఏఈవో జైపాల్, రైతులు నారాయణ, గంగయ్య ఉన్నారు.

ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

కుంటాల: సాధారణంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించుకోవడం సహజమే. కానీ మండలంలోని విఠాపూర్ గ్రామంలో సర్పంచ్ గల్లపురం లక్ష్మి రమేష్ ఆధ్వర్యంలో తాజా మాజీ సర్పంచ్, వార్డు సభ్యుల ఆత్మీయ సమ్మేళనాన్ని బుధవారం నిర్వహించారు. మండలంలోని విఠాపూర్, వెంకూర్ గ్రామపంచాయతీలో 1994 నుంచి 2024 వరకు ఉన్న పాలకవర్గ సభ్యులు అందరూ హాజరయ్యారు. ప్రజలకు చేసిన సేవ, అభివృద్ధిపై చర్చించి రోజంతా సరదాగా గడిపారు. అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో తాజా, మాజీ సర్పంచ్‌లు గల్లాపురం లక్ష్మిరమేష్, విఠల్‌రావు పటేల్, ఉమ్రి లక్ష్మణ్, సరోజా సాయన్న, మగ్గిడి శృతి, మగ్గిడి దిగంబర్, కారోబారి లక్ష్మణ్ పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

నేరడిగొండ: మండలంలోని కుప్టి జాతీయ రహదారి వద్ద బుధవారం సాయంత్రం బైక్ అదుపుతప్పి ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. బోథ్ మండలం ఇస్కర్‌పల్లి గ్రామానికి చెందిన ఆడెం రవిందర్, కడెం మండలం శంభుగూడ గ్రామానికి చెందిన మెస్రం అనిల్ కుమార్‌లు ద్విచక్ర వాహనంపై ఇచ్చోడ వైపు నుంచి బోథ్‌కు వెళ్తుండగా కుప్టి జాతీయ రహదారిపై బైక్ అదుపు తప్పి కిందపడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు.


గాయాలపాలైన యువకుడు

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి రిమాండ్

లక్ష్మణచాంద: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి 14రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఈ నెల 7న మండలంలోని మల్లాపూర్ గ్రామంలో గొడవ జరుగుతుందని 100 డయల్ ద్వారా సమాచారం రాగా లక్ష్మణచాంద పోలీస్‌స్టేషన్‌కి చెందిన పోలీస్ సిబ్బంది కానిస్టేబుల్ అశోక్, దిలీప్‌లు మల్లాపూర్ గ్రామానికి వెళ్లారు. గొడవకు కారణమైన అదే గ్రామానికి చెందిన తలారి గణేష్ అనే వ్యక్తి పోలీస్‌వారితో దుర్భాషలాడుతూ వారి విధులకు ఆటంకపరచగా ఎస్సై శ్రీకాంత్ అతడిపై కేసు నమోదు చేశాడు. బుధవారం అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా 14రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై పేర్కొన్నాడు.

సదర్మాట్ ఆయకట్టుకు నీరందిస్తాం

- మంత్రి సీతక్క


ఎమ్మెల్యే, కలెక్టర్‌తో మాట్లాడుతున్న మంత్రి

ఖానాపూర్: ఖానాపూర్, కడెం మండలాల రైతులకు సాగునీరు అందించే సదర్మాట్ ద్వారా రైతుల రెండు పంటలకు సరిపడా సాగునీటిని అందిస్తామని మంత్రి సీతక్క అన్నారు. బుధవారం మండలంలోని మేడంపల్లి గ్రామంలోని సదర్మాట్‌ను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో పాటు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి మంత్రి సందర్శించారు. ఆయకట్టు పరిధిలోని 13వేల ఎకరాలకు నీటిని అందించాలని, ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌తో పాటు ఇరిగేషన్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లి నీరు అందేలా కృషి చేస్తామన్నారు.

సమాంతర అభివృద్ధికి కృషి..

ఉమ్మడి జిల్లా వెనకబడిన ప్రాంతం కావడంతో పేదలు ఎక్కువగా ఉన్నారని మంత్రి అన్నారు. ఈ ప్రాంతంపై దృష్టిపెడుతూనే మిగతా ప్రాంతాలతో సమాంతరంగా అబివృద్ధి చేసేందుకు సీఎంతో పాటు ప్రభుత్వం పూర్తిస్థాయిలో కృషి చేస్తుందన్నారు. త్వరలో ఐదు జిల్లాల ఇరిగేషన్ అధికారులు, కలెక్టర్‌లు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించి ఎక్కడెక్కడ పనులు చేస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందో చర్చించి చర్యలు చేపడుతామన్నారు. అంతకుముందు పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ ఇంటికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి వెళ్లి తేనీటి విందును స్వీకరించారు. సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నందిరామయ్య సదర్మాట్ సమస్యపై మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఐసీడీఎస్ సీడీపీవో సరిత ఆధ్వర్యంలో సూపర్‌వైజర్లు మంత్రిని కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. నాయకులు శ్రీహరిరావు, చిన్నం సత్యం, జంగిలి శంకర్, యూసుఫ్‌ఖాన్, పుప్పాల శంకర్, నిమ్మల రమేష్, అబ్దుల్ మాజిద్, షబ్బీర్‌పాషా, సలీంఖాన్, శ్రీనివాస్, ఆసీఫ్, కమలాకర్, భూమేశ్ ఉన్నారు.

సీతక్కకు వినతుల వెల్లువ


వినతిపత్రం ఇస్తున్న ఉద్యమకారుల ఫోరం నాయకులు

నిర్మల్‌ఖిల్లా/నిర్మల్‌రూరల్: అధికారంలోకి రాగానే సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమల్లోకి తెస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కోరుతూ జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్రమంత్రి సీతక్కకు సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు వినతిపత్రం జేశారు. ఇందులో ఏఈవోల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండపల్లి అశోక్ కుమార్, చక్కెర శ్రీనివాస్, నరేష్, రాకేష్ పాల్గొన్నారు.

అమరుల కుటుంబాలను ఆదుకోవాలి

నిర్మల్‌టౌన్/భైంసాటౌన్: తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అమరుల కుటుంబాలను ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా నాయకులు డాక్టర్ ముష్కం రామకృష్ణగౌడ్ మంత్రి సీతక్కకు విన్నవించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చైర్మన్ కొట్టే శేఖర్, నిర్మల్ జిల్లా నాయకులు చాకేటి లస్మన్న, సామ కిరణ్‌కుమార్ రెడ్డి ఉన్నారు.

కుభీర్: మండలంలోని విద్యావలంటీర్లు మంత్రికి వినతిపత్రం అందించారు. ఇందులో ఆ సంఘం అధ్యక్షుడు లవకుశ్ మంత్రి విచారణ చేసి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ జిల్లా పెన్షనర్ల సంఘం నాయకులు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు లింగన్న, ప్రధాన కార్యదర్శి హనుమంత్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, యూనిట్ కార్యదర్శి జనార్దన్, యూనిట్ కోశాధికారి రమేష్ ఉన్నారు.

దిలావర్‌పూర్: తమ గ్రామ పరిసరాల్లో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణంతో భూములను వదిలివేయాల్సిన పరిస్థితి ఉందంటూ గుండంపల్లి గ్రామ రైతులు మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లారు. ఫ్యాక్టరీని తరలించి తమకు న్యాయం చేయాలని కోరారు.

మద్యం పట్టివేత

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్‌లో బుధవారం పక్కా సమాచారం మేరకు గాజుల సాయి ఇంట్లో బుధవారం దాడి చేసి అక్రమంగా నిల్వచేసిన మద్యం పట్టుకున్నట్లు ఎస్సై హన్మండ్లు తెలిపారు. దాని విలువ రూ.5,585 ఉంటుందని, కేసు నమోదు చేసినట్లు చేసినట్లు ఎస్సై చెప్పారు.

అభిమానాన్ని మెచ్చి.. చెప్పులు ధరింపజేసి


చెప్పులు ధరించిన యువ నాయకుడు కపిల్

తాంసి: భీంపూర్ మండలంలోని అంతర్గాం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు బక్కి కపిల్‌యాదవ్ బుధవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో చెప్పులు ధరించాడు. పార్టీ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌పై తనకున్న అభిమానంతో అనిల్ జాదవ్ ఎమ్మెల్యేగా గెలువాలని కోరుతూ ఎన్నికల్లో చెప్పులు ధరించకుండా పార్టీ తరఫున ప్రచారం నిర్వహించాడు. అనిల్ జాదవ్ ఎమ్మెల్యేగా గెలిచి ప్రమాణ స్వీకారం చేసిన తరువాత చెప్పులు ధరిస్తానని తన ఇష్ట దైవాన్ని సైతం వేడుకున్నాడు. బోథ్ ఎమ్మెల్యేగా అనిల్ జాదవ్ భారీ మెజార్టీతో గెలుపొందడంతో బుధవారం భీంపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే స్వయంగా తీసుకొచ్చిన చెప్పులను పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో యువ నాయకుడు బక్కి కపిల్ ధరించాడు. తనపై ఉన్న అభిమానంతో ప్రచారం చేసినందుకు కపిల్‌ను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించాడు.

సీసీఐ తెరిచాకే ఓట్లు అడగాలి

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవి కుమార్


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని సీసీఐ (సిమెంట్ ఫ్యాక్టరీ) పునఃప్రారంభించాకే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఓట్లు అభ్యర్థించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవి కుమార్ అన్నారు. సీసీఐని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో బీజేపీ ఎమ్మెల్యేను గెలిపిస్తే సీసీఐని ప్రారంభిస్తామని అమిత్‌షా హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. పునరుద్ధరణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, మళ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అడగడానికి రావడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే, ఎంపీ స్థానాల్లోనూ బీజేపీ పార్టీయే విజయం సాధించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణ, ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ రైల్వే లైన్, జిల్లా కేంద్రంలో విమానాశ్రయం ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి కలిసి వచ్చే పార్టీలు, ప్రజా సంఘాలతో సీపీఎం భవిష్యత్తులో పోరాటాలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మల్లేష్, జిల్లా నాయకులు లంకా రాఘవులు, బండి దత్తాత్రి, పూసం సచిన్, కిరణ్ ఆశన్న, సురేందర్ గంగన్న, మంజుల పాల్గొన్నారు.

ఇద్దరు మట్కా నిర్వాహకుల అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: ఇద్దరు మట్కా నిర్వాహకులను సీసీఎస్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌లో మట్కా నిర్వహిస్తుండగా షేక్‌అహ్మద్, మసూద్ ఖాన్‌లను పట్టుకున్నారు. వీరి నుంచి మట్కా చీటీలతో పాటు రూ.5,950, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. టూటౌన్‌లో కేసు నమోదు చేశారు. మట్కా నిర్వహిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.